




ప్రతి సిరా చుక్కలో చైతన్యం

# తెలంగాణ సైన్యం

డిజిటల్ తెలుగు దినపత్రిక

TS-34-0004749

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 221, చీఫ్ ఎడిటర్.. నవీన్ కుమార్. వెల రూ. 4 /-, గురువారం 21-05-2026

## హోర్ముజ్‌ను దాటిన 60 లక్షల బ్యారెల్ల ముడి చమురు

### తగ్గుముఖం పట్టిన క్రూడ్ ధరలు



**ఇంటర్నెట్ డెస్క్‌మే 20 :**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పలు భారీ చమురు ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. సుమారు 60 లక్షల బ్యారెల్ల ముడి చమురుతో ప్రయాణిస్తున్న ఈ ట్యాంకర్లు సురక్షితంగా గమ్యస్థానాల వైపు సాగినట్లు అంతర్జాతీయ షిప్పింగ్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత ఈ స్థాయిలో చమురు రవాణా జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తాజాగా హోర్ముజ్ జలసంధిని దాటిన ట్యాంకర్లలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), కువైట్ దేశాలకు చెందిన ముడి చమురు ఉన్నట్లు సమాచారం. ఈ సరకు ప్రధానంగా ఆసియా దేశాల మార్కెట్లకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో కొంత ఊరట కనిపించింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు సుమారు 2.5 శాతం మేర తగ్గింది. ఇటీవల హోర్ముజ్ జలసంధిలో రవాణాపై ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ అమలు చేయవచ్చని ఇరాన్ సంకేతాలు ఇవ్వడంతో ప్రపంచ ఆయిల్ మార్కెట్లలో ఆందోళన నెలకొంది. అయితే ప్రస్తుతం ట్యాంకర్లు ఎలాంటి అంతరాయం లేకుండా సురక్షితంగా ప్రయాణించడం మార్కెట్లకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. చమురు సరఫరాలు ఇదే విధంగా కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు మరింత స్థిరపడే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## చంద్రయాన్-3 మరో సంచలనం.

### విక్రమ్ ల్యాండర్ కీలక ఆవిష్కరణ..




**ఇంటర్నెట్ డెస్క్‌మే 20 :**
ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ మరో కీలక శాస్త్రీయ ఆవిష్కరణకు దారితీసింది. విక్రమ్ ల్యాండర్ చేసిన చిన్న 'హాప్ ఎక్స్‌పెరిమెంట్' చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంత ఉపరితలం గురించి కొత్త వివరాలను బయటపెట్టింది. మిగిలిపోయిన ఇంధనాన్ని ఉపయోగించుకోవాలనే అనూహ్య నిర్ణయంతో ఈ ప్రయోగం చేపట్టారు. చంద్రుడిపై శివశక్తి పాయింట్ వద్ద ఉన్న నేల గతంలో భావించిన దానికంటే చాలా వైవిధ్యమైనదని, సంక్లిష్టమైనదని వెల్లడించే ఒక మైలురాయిగా ఈ ప్రయోగం నిలిచింది.
ఈ ప్రయోగంలో ల్యాండర్ సుమారు 40 నుంచి 50 సెంటీమీటర్లు పైకి ఎగిరి, కొద్దిదూరం పక్కకు వెళ్లి మళ్లీ సాఫ్ట్‌గా ల్యాండ్ అయింది. ఈ ప్రయోగం వల్ల చంద్రుడి ఉపరితలంపై ఉన్న పై పొర తొలగిపోయి, లోపలి మట్టిని చంద్ర సర్ఫేస్ థర్మోఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ పరికరం పరిశీలించే అవకాశం లభించింది. దీంతో చంద్రుడి మట్టి ఒకేలా కాకుండా పలు పొరలుగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.
పైభాగం పొర చాలా మెత్తగా ఉండగా, కింద భాగం మరింత ఘనంగా ఉందని అధ్యయనం తెలిపింది.
ఈ సమాచారం భవిష్యత్ చంద్ర మిషన్లకు చాలా కీలకంగా మారనుంది.
ముఖ్యంగా నాసా ఆర్టెమిస్ మిషన్ ద్వారా చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలకు ఈ డేటా ఉపయోగపడనుందని నిపుణులు చెబుతున్నారు.

## పాకిస్థాన్‌లో కుప్పకూలిన యుద్ధం విమానం..

### పైలట్లు సురక్షితం..



**పాకిస్థాన్ ,మే20:**
ఎయిర్ ఫోర్స్‌కు చెందిన జేఎఫ్-17 యుద్ధ విమానం కుప్పకూలింది. చైనా సహాయంతో తయారు చేసిన ఈ జేఎఫ్-17 థండర్ ఫైటర్ జెట్‌లను పాక్ ఎయిర్‌ఫోర్స్ వినియోగిస్తోంది. తాజాగా తమ పైలట్లకు పాక్ ఎయిర్‌ఫోర్స్ శిక్షణ ఇస్తున్న సమయంలో ఇది కుప్పకూలింది. ఈ ఘటన పాకిస్థాన్‌లోని కమ్రా ప్రాంతంలో జరిగినట్లు వార్తలు వచ్చాయి. విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లు ప్రమాదానికి ముందే సురక్షితంగా బయటపడినట్లు సమాచారం.

2 లో

## 59 ఏళ్ల నిరీక్షణకు తెర..

### తమిళనాడు మంత్రివర్గంలో కాంగ్రెస్




**చెన్నై:** దాదాపు 59 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు మంత్రివర్గంలోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం గురువారంనాడు మంత్రివర్గ విస్తరణ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్‌లు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేశారు.'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో పార్టీ ఎమ్మెల్యేలు అడ్వకేట్ రాజేష్ కుమార్, పి.విశ్వనాథ్‌లు విజయ్ సారథ్యంలోని తమిళనాడు క్యాబినెట్‌లో మంత్రులుగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇది మాకు ఒక చారిత్రక సందర్భం. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు క్యాబినెట్‌లో చేరుతోంది. ప్రభుత్వంలో చేరుతున్న మా ఎమ్మెల్యేలు ఇద్దరికీ అభినందనలు.

2 లో

## సాంకేతికతతో గ్లోబల్ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉంది:

### సీఎం చంద్రబాబు



**అమరావతి, మే 20 :** సాంకేతికతతో గ్లోబల్ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ అభివృద్ధితో పాటు ప్రజలకు మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని ఉద్ఘాటించారు. బెంగుళూరు-ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45 వ వార్షికోత్సవ ఈరోజు(బుధవారం) జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. స్పేస్, డ్రోన్, డేటాసెంటర్లు ఏపీలో ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. మొదటి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు అవుతోందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తున్నామని, అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నా ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని అన్నారు.
శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. కేవలం ఓ ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని.. ఓ భారతీయుడిగా, గురూజీ బోధనలను అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని తెలిపారు.

2 లో

## పేదలకు ఉచిత వైద్యం అమలు చేయాలి..

### ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**ఢిల్లీ,మే 20 :**
ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించే విధానంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని సుప్రీంకోర్టు ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ భూములను ఉచితంగా లేదా రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు, పేద రోగులకు నిర్దిష్ట శాతం ఉచిత చికిత్స అందించడం తప్పనిసరి అని కోర్టు స్పష్టం చేసింది. అర్హులైన పేద రోగులను ఎలా గుర్తించాలి, ఆస్పత్రుల్లో ఎంత శాతం పడకలను కేటాయించాలి, ఉచిత చికిత్స అమలును ఎలా పర్యవేక్షించాలి వంటి అంశాలపై స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని ధర్మాసనం సూచించింది. ఈ విధానం సమర్థవంతంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో 51 ప్రైవేట్ ఆస్పత్రులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటిలో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందినప్పటికీ పేదలకు ఉచిత చికిత్స అందించడం లేదని ఆరోపిస్తూ



కొందరు వ్యక్తులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం తాజా ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం త్వరలో కొత్త గైడ్‌లైన్స్ రూపొందించే అవకాశముంది. దీంతో పేదలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందే అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

## సరస్వతీ అంత్య పుష్కరాలకు ఘన ఏర్పాట్లు..

### భక్తులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు



**హైదరాబాద్, మే 20 :** సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు. మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది. 12 రోజుల పాటు కొనసాగే ఈ పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు చేపట్టింది. పుష్కర ప్రాంతంలో భద్రత కోసం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 100 మంది గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, సేఫ్టీ బోట్లను మోహరించారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక హారతి, తెప్పోత్సవాలకు కూడా భారీ ఏర్పాట్లు చేశారు. అదనంగా రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయగా, నాగేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. మీడియా సెంటర్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

- భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు
- 23 ప్రాంతాల్లో భారీ పార్కింగ్ సదుపాయాలు
- 245 ఎకరాల్లో 1.70 లక్షల వాహనాల పార్కింగ్ ఏర్పాటు
- 90 షటిల్ బస్సులతో రవాణా సదుపాయం
- ఘాట్‌ల వద్ద చలువ పందిళ్లు, కాయర్ మ్యాట్లు
- అందుబాటులో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- 500 ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు
- 300 మంది వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపులు
- అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు సిద్ధం

## ఫ్యూచర్ సిటీ డిజైన్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి సూచనలివే..



**హైదరాబాద్, మే 20:**
పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీ లో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీపడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

2 లో

## సంపాదకీయం

### రైతన్నకు మోదీ సర్కార్ మేలు



ఇరాన్‌పై అమెరికా-- ఇజ్రాయెల్ సంయుక్త యుద్ధంతో నెలకొన్న చమురు, నౌకాయాన సంక్షోభాలతో అనేక వర్ధమాన దేశాలు అల్లకల్లోలమవుతున్నాయి. మరే దేశం కంటే భారత్ అత్యధికంగా నష్టపోతోంది. అయితే ఈ యుద్ధం అనంతర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ ఇప్పటినుంచే సమాయత్తమవుతోంది. దీర్ఘకాలిక వ్యూహాలపై దృష్టి సారించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అసాధారణ దార్శనికతను చూపుతోంది .పశ్చిమాసియాలో యుద్ధం మూలంగా భారత్ నుంచి బ్రెజిల్ వరకు, నైజీరియా నుంచి ఆస్ట్రేలియా దాకా అనేక దేశాలలో వ్యవసాయ సంక్షోభం ఉత్పన్నమవుతోంది. ఇరాన్ యుద్ధం ఇదే విధంగా కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా పంట మార్పిడి సాగు అనివార్యమవగలదని ప్రపంచ ఆహార సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఆహార ధరలు పెరిగి ద్రవ్యోల్బణం హెచ్చుతోందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గడ్డు కాలంలో భారత్ పరిస్థితి పలు ఇతర దేశాలతో పోల్చిచూస్తే మెరుగ్గా ఉన్నదనడంలో సందేహం లేదు. ఇరాన్ యుద్ధ తక్షణ సవాళ్లకు దీటుగా ప్రతిస్పందించడమే కాకుండా భవిష్యత్తులో వాటిల్లే సరఫరా సంక్షోభాల ప్రభావం కనిష్ఠస్థాయిలో ఉండేలా చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఆహార ధాన్యాల అధిక దిగుబడులకు అవసరమైన యూరియా, డీఏపీ తదితర ఎరువులు, రసాయనాలు చమురు అనుబంధ ఉత్పత్తులు. ఈ కారణంగానే సమస్త వర్ధమాన దేశాలు గల్ఫ్ దేశాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రపంచ యూరియా అవసరాలలో దాదాపు సగభాగాన్ని సౌదీ అరేబియా, ఖతర్, ఇరాన్‌లే తీర్చుతున్నాయి. ఈ మూడు దేశాలతో పాటు ఒమాన్ కూడ భారత రైతాంగ యూరియా అవసరాలను పూర్తిగా తీర్చుతోంది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ ఏటా లక్ష టన్నుల యూరియాను దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితులలో ఉత్పత్తి, రవాణాకు అంతరాయం ఏర్పడడంతో ఎరువుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తత్ఫలితంగా పలు దేశాలలో వ్యవసాయరంగం సంక్షోభంలో పడుతోంది.

యూరియాను దిగుమతి చేసుకోవడంతో పాటు దేశీయంగా ఉత్పత్తి చేసుకుంటున్న దేశాలలో భారత్ అగ్రగామిగా ఉన్నది. ఆత్మనిర్భరతకు తార్కాణాలుగా సగర్వంగా చెప్పుకునే వాటిలో భారతీయ ఎరువుల కార్మాగారాలు ప్రధానమైనవి. మోదీ ప్రభుత్వం ఈ కర్మాగారాలకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి అధునికీకరించింది. ఈ ఎరువుల కర్మాగారాలు అన్నీ ఖతర్ నుంచి దిగుమతి చేసుకునే సహజ వాయువుతో పనిచేస్తాయి. ఇరాన్ యుద్ధం వల్ల ఖతర్ నుంచి సహజవాయువు సరఫరా నిలిచిపోవడంతో భారతీయ ఎరువుల రంగానికి తీవ్ర విఘాతమేర్పడింది. సౌదీ అరేబియా, ఇరాన్ నుంచి కూడా ఎరువుల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దేశంలో ఎరువుల కొరతను నివారించేందుకు మోదీ సర్కార్ సంకల్పించింది. ఈ సంకల్ప సాధనకై అల్జీరియా మొదలు ఇండోనేషియా దాకా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ప్రతి ఎరువుల ఉత్పాదక దేశం నుండి ఎరువులు, వాటి ముడి సరుకును కొనుగోలు చేస్తోంది. భారతీయ రాయబారులు రేయింబవళ్ళు ప్రత్యామ్నాయ కొనుగోళ్ళకు ప్రయత్నిస్తున్నారు. హోర్ముజ్ జలసంధి దిగ్బంధంతో ఎరువులు లభించే అవకాశాలు సన్నగిల్లడంతో మరే దేశమూ చేయని విధంగా రెండింతలు ఎక్కువ ధరతో ఎరువులు కొనుగోలు చేసి ఈ ఖరీఫ్ సీజన్‌కు ముందు భారత రైతాంగాన్ని మోదీ ప్రభుత్వం ఆదుకున్నది. భారత్ చెల్లించిన అధిక ధరలకు పలు దేశాలు దిగ్భ్రాంతి చెందాయనడం సత్యదూరం కాదు. భారత ప్రభుత్వరంగ సంస్థలయిన క్రిబ్కో, ఇఫ్కోలు ఒమాన్‌లో ఆ దేశ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో ఎరువుల ఉత్పత్తి కర్మాగారాన్ని నడుపుతున్నాయి. ఒమాన్‌లో ఉత్పత్తి అయ్యే ఎరువులను భారత్‌లోని సహకార వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా విక్రయిస్తారు. ఒమాన్‌లో ఎరువుల కర్మాగారాన్ని 250 బిలియన్ డాలర్ల వ్యయంతో విస్తరించేందుకు భారత్ సంకల్పించింది. కల్లోల హోర్ముజ్ జలసంధితో సంబంధం లేకుండా నేరుగా గుజరాత్ తీరానికి ఎరువులు చేరుకుంటాయి. 45 కిలోల యూరియా బస్తా ధర అంతర్జాతీయ విపణిలో రూ.4,500 కాగా కేంద్ర ప్రభుత్వం భారీ రాయితీతో రూ.270 కంటే తక్కువ ధరకు విక్రయిస్తూ భారత రైతాంగాన్ని ఆదుకుంటోంది. ఈ నిర్మాణాత్మక సహాయక చర్యల గురించి సామాన్య ప్రజానీకానికి సవివరంగా తెలియజేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. మస్జీదు -- మందిర్ గురించి ఉత్సాహంగా మాట్లాడే అధికార పక్షంవారు వ్యయప్రయాసలతో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచుతోన్న నిజమైన ఆత్మనిర్భర చర్యల గూర్చి మాట్లాడడానికి అనాసక్తి చూపడం విచిత్రంగా ఉన్నది. సకల వేళల్లోను జాతి ప్రయోజనాలు కాపాడుకునే దిశగా మోదీ సర్కార్ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతోంది.

## పాకిస్థాన్‌లో కుప్పకూలిన యుద్ధం విమానం..

పాకిస్థాన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన జేఎఫ్-17 యుద్ధ విమానం కుప్పకూలింది. చైనా సహాయంతో తయారు చేసిన ఈ జేఎఫ్-17 థండర్ ఫైటర్ జెట్‌లను పాక్ ఎయిర్‌ఫోర్స్ వినియోగిస్తోంది. తాజాగా తమ పైలట్లకు పాక్ ఎయిర్‌ఫోర్స్ శిక్షణ ఇస్తున్న సమయంలో ఇది కుప్పకూలింది. ఈ ఘటన పాకిస్థాన్‌లోని క్వమ్రా ప్రాంతంలో జరిగినట్లు వార్తలు వచ్చాయి.

విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లు ప్రమాదానికి ముందే సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. అయితే వారికి గాయాలయ్యాయని స్థానిక మీడియా తెలిపింది. ఘటనలో పౌరులకు ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో



సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాంకేతిక లోపం కారణంగా విమానం కూలి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల్లో విమానం కూలే ముందు ఆకాశంలో ప్రయాణిస్తున్న దృశ్యాలు, అనంతరం పొగలు ఎగసిపడటం కనిపించింది. జేఎఫ్-17 థండర్ ఫైటర్ జెట్‌లను చైనా, పాక్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ ఫైటర్ జెట్‌లను పాక్ ఎయిర్ ఫోర్స్ విస్తృతంగా ఉపయోగిస్తోంది. తక్కువ ఖర్చుతో మల్టీ-రోల్ యుద్ధ సామర్థ్యం కలిగిన విమానంగా దీనిని ప్రచారం చేస్తుంటారు. అయితే గత కొన్ని సంవత్సరాల్లో జేఎఫ్-17 విమానాలు పలు ప్రమాదాలకు గురయ్యాయి.

## 59 ఏళ్ల నిరీక్షణకు తెర..

చెన్నై: దాదాపు 59 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు మంత్రివర్గంలోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం గురువారంనాడు మంత్రివర్గ విస్తరణ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్‌లు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేశారు.

'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో పార్టీ ఎమ్మెల్యేలు అడ్వకేట్ రాజేష్ కుమార్, పి.విశ్వనాథ్‌లు విజయ్ సారథ్యంలోని తమిళనాడు క్యాబినెట్‌లో మంత్రులుగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇది మాకు ఒక చారిత్రక సందర్భం. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు క్యాబినెట్‌లో చేరుతోంది. ప్రభుత్వంలో చేరుతున్న మా ఎమ్మెల్యేలు ఇద్దరికీ అభినందనలు. తమిళనాడు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్దేశించిన సంక్షేమ, ప్రజానుకూల ప్రభుత్వ విజన్‌ను సాకారం చేస్తారని ఆశిస్తున్నాం' అని ఆ పోస్టులో కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.



కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. సుదీర్ఘ కాలంగా డీఎంకేతో పొత్తు సాగించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకుండా పరోక్షంగా మద్దతు కొనసాగస్తూ వచ్చింది. ఇటీవల ఎన్నికల అనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో డీఎంకే పార్టీతో పొత్తుకు ఉద్వాసన చెప్పి విజయ్ టీవీకే ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆ పార్టీతో జతకట్టింది.



తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు గాను టీవీకే 118 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు 10 సీట్లు తగ్గడంతో పొత్తులకు తెరతీసింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంల్, వీసీకేలు విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో విజయ్ ముఖ్యమంత్రిగా మే 10న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది క్యాబినెట్‌లో చేరారు.

## సాంకేతికతతో గ్లోబల్ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉంది:సీఎం చంద్రబాబు

అమరావతి, మే 20 : సాంకేతికతతో గ్లోబల్ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ అభివృద్ధితో పాటు ప్రజలకు మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని ఉద్ఘాటించారు. బెంగుళూరు-ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45 వ వార్షికోత్సవ ఈరోజు(బుధవారం) జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. స్పేస్, డ్రోన్, డేటాసెంటర్లు ఏపీలో ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. మొదటి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు అవుతోందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తున్నామని, అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నా ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని అన్నారు.

శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. కేవలం ఓ ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని.. ఓ భారతీయుడిగా, గురూజీ బోధనలను అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని.. శాంతిసామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని చెప్పుకొచ్చారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తున్నారని ఉద్ఘాటించారు. హింసలేని సమాజం – ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని తెలిపారు. యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయట పడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని ప్రస్తావించారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్‌ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని అన్నారు.

గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కోని సమర్థంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ లాంటి సమర్థవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని ఉద్ఘాటించారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని వెల్లడించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని ప్రస్తావించారు. ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, అహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు ఏపీలో ఉన్నాయని



ప్రస్తావించారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని.. పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు.

అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని.. ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేనని తాను భావిస్తున్నానని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని తెలిపారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యమని ఉద్ఘాటించారు. ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకున్నామని వివరించారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టామని.. స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని ప్రస్తావించారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడి లేని సమాజాన్ని కూడా తీసుకురావాలని అన్నారు. విధానకర్తగా తాము అభివృద్ధి వైపుగానే ఆలోచన చేయగలమని తెలిపారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని సూచించారు. ఈ విలువలను తాము ప్రపంచానికి చాటి చెబుతామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఫ్యూచర్ సిటీ డిజైన్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి సూచనలివే..

**హైదరాబాద్, మే 20:** పెరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీ లో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీపడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు.ఫ్యూచర్ సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ



పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటాసిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఘోరం.. కోనేరులో పడి ముగ్గురు చిన్నారుల మృతి..

**జగిత్యాల:** జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మేడిపల్లి మండలం కొండాపూర్‌లో ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తూ మృతిచెందారు. శివగంగా ఆలయ కోనేరులో పడి




ప్రాణాలు కోల్పోయారు. మృతిచెందిన చిన్నారులను మన్వీత్ (11), మనస్వి (9), షార్వింద్ (7)గా గుర్తించారు.బుధవారం రోజు మధ్యాహ్న సమయంలో సరదాగా ఆడుకునేందుకు ఆలయం వద్దకు వెళ్లిన చిన్నారులు.. అనంతరం ఈత కొట్టేందుకు కోనేరులో దిగారు. అయితే ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు.కొద్దిసేపటి తర్వాత ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కోనేరులో నుంచి వారిని బయటకు తీశారు. ముగ్గురినీ హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భారతి-భూషణం దంపతుల పిల్లలు మన్వీత్, మనస్వి కాగా.. భార్గవి-శేఖర్ కుమారుడు షార్వింద్. చిన్నారుల మృతితో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మేడ్చల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.226.78 కోట్లు మంజూరు




**మేడ్చల్, మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** మేడ్చల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 226.78 కోట్ల నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మరియు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.మేడ్చల్ నియోజకవర్గంలో రెండు లైన్ల రహదారులను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు ప్రత్యేక కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు అభినందనలు తెలిపారు.గుండ్లపోచంపల్లి, దుండిగల్ డివిజన్ల పరిధిలో రూ.47.51 కోట్ల వ్యయంతో మేడ్చల్ చెక్‌పోస్ట్ ఔటర్ రింగ్ రోడ్ నుండి దుండిగల్ చౌరస్తా వరకు ఉన్న రహదారిని 2 లైన్ల నుంచి 4 లైన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు.ఈ అభివృద్ధి పనుల కోసం కృషి చేసిన పీసరి మహిపాల్ రెడ్డికి గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ముదిరాజ్ నవీన్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తగ్గించడం అని ఎడ్ల శ్రీను వివరించారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ హనుమంతరావు



**కారేపల్లి మే 20 తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**
కారేపల్లి మండలంలోని బజ్యాతండ గ్రామ పంచాయితీ పరిధిలోని బొర్రయ్య కుంట వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం బజ్యాతండ గ్రామ పంచాయితీ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు స్వయంగా పరిశీలించారు. గ్రామాభివృద్ధికి కీలకమైన ఈ పనులు నాణ్యతతో, వేగవంతంగా కొనసాగాలని ఆయన అధికారులకు సూచించారు.బొర్రయ్య కుంట అభివృద్ధి ద్వారా గ్రామంలో భూగర్భ జలాల స్థాయి పెరగడంతో పాటు రైతులకు సాగునీటి సమస్యకు ఉపశమనం కలుగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు శాశ్వత ఆస్తుల సృష్టికి దోహదపడుతోందన్నారు. పనుల్లో పాల్గొంటున్న కార్మికులతో మాట్లాడిన సర్పంచ్, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూలీల హాజరు, పనుల నాణ్యత, పారదర్శకత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు."గ్రామ అభివృద్ధే మా లక్ష్యం... ప్రజల సంక్షేమమే మా ధ్యేయం" అని సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు తెలిపారు.ఈ పరిశీలనలో పంచాయతీ సెక్రటరీ ధారావత్ జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్,ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను ఆగం పట్టిస్తున్న మిల్లుల యాజమాన్యం



**మక్తల్,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** నర్వ మండలంలో సొసైటీ వద్ద మొక్కజొన్నలు అమ్మేందుకు వచ్చిన రైతులు నాలుగు రోజులుగా రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రైతులు మాజీ శాసనసభ్యుడు చిట్టెం రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నర్వ మండలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ ఉదయ్‌ను ప్రశ్నిస్తూ, రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా నాలుగు రోజులుగా రోడ్డుపైనే ఉంచడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఒకవేళ వర్షం వస్తే ధాన్యం తడిసి నష్టపోతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు.అలాగే, నాలుగు రోజులుగా ట్రాక్టర్లను నిలిపివేయడంతో రైతులపై పడుతున్న అదనపు కిరాయి భారం ఎవరు భరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే రైతుల మొక్కజొన్నను కొనుగోలు చేసి, సాయంత్రం ఐదు గంటలలోపు ఒక్క ట్రాక్టర్ కూడా అక్కడ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దీనిపై స్పందించిన సొసైటీ సీఈఓ ఉదయ్, సాయంత్రం వరకు మొక్కజొన్నను అన్‌లోడ్ చేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.


## బొక్కలతండలో విద్యుత్ వెలుగులు

### ఓవర్‌లోడ్‌తో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు రాత్రికిరాత్రే ప్రత్యామ్నాయం.




**కారేపల్లి,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** బజ్యాతండ గ్రామ పంచాయితీ పరిధిలోని బొక్కలతండ గ్రామంలో ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ అకస్మాత్తుగా కాలిపోవడంతో గ్రామం మొత్తం అంధకారంలో మగ్గింది. తీవ్ర ఎండల మధ్య విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అయితే సమస్యను తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ప్రజలకు ఉపశమనం కలిగించారు.రాత్రి వేళల్లోనే అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి, దాదాపు రాత్రి 11 గంటల సమయంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. చీకట్లో ఉన్న గ్రామానికి మళ్లీ వెలుగులు నింపడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితిలో ఆలస్యం చేయకుండా స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రజలు అభినందించారు.గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. రాత్రివేళల్లోనే పనులు పూర్తి చేసి కరెంటు అందించడం అధికారుల బాధ్యతాయుత సేవలకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బజ్యాతండ గ్రామ పంచాయితీ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు, ఏఈ సి.హెచ్. వెంకన్న, ఫోర్‌మన్,లక్ష్మి నారాయణ,లైన్‌మెన్ రషీద్,విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి



**మూసాపేట,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జున, ఉపాధ్యాయుడు సీజీ మధుతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ తల్లిదండ్రులను కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించాలని, వారి భవిష్యత్తును ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంతో పాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని, 2026 విద్యాసంవత్సరంలో మూసాపేట పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు."ఈరోజు మీ పిల్లలకు పాఠాలు బోధిస్తున్న మేము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ స్థాయికి వచ్చాం" అని ప్రధానోపాధ్యాయుడు నాగార్జున తల్లిదండ్రులకు వివరించారు.అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగార్జున, ఉపాధ్యాయుడు సీజీ మధు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్సీ గ్రూప్-1 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.





**హుజురాబాద్, మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** తెలంగాణలో ఎస్సీ గ్రూప్-1 పరిధిలోని 15 ఉప కులాల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం రూ. 5,000 కోట్ల నిధితో ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర విభాగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించింది.వివిధ పనుల నిమిత్తం రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్ వచ్చే నిరుపేద కులబాంధవులకు బస చేయడానికి వసతి లేక రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో నానా అవస్థలు పడుతున్నారని సిరిపాటి వేణు ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఇబ్బందులను దూరం చేసేందుకు హైదరాబాద్‌లో 1500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, ప్రభుత్వ ఖర్చుతోనే 'బేడ బుడగ జంగాల ఆత్మగౌరవ భవనం' నిర్మించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే రాష్ట్రంలో కుల గణన, ఎస్సీ వర్గీకరణను పూర్తి చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.వర్గీకరణ జరిగి ఏడాది గడుస్తున్నా గ్రూప్-1 కులాలకు ఆశించిన గుర్తింపు లభించలేదని వేణు పేర్కొన్నారు. గ్రూప్-1 పరిధిలోని 15 కులాల జనాభా దాదాపు 10 లక్షలు ఉండగా, అందులో ఒక్క బేడ బుడగ జంగాల జనాభానే 2 లక్షలకు పైగా ఉందన్నారు. అందువల్ల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అత్యధిక జనాభా కలిగిన బేడ బుడగ జంగం వర్గానికి చైర్మన్ పదవి కేటాయించాలని, రాబోయే నామినేటెడ్ పదవుల్లోనూ ఈ కులాలకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.జన సంఘం విజ్ఞప్తులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎస్సీ గ్రూప్-1 లోని అత్యంత వెనుకబడిన కులాల సమస్యలను, ఆత్మగౌరవ భవన ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దేవుని కుమార్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ పులేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేటలో మెడికల్ షాపులు బంద్



**మూసాపేట,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు మూసాపేట మండల కేంద్రంలోని మెడికల్ షాపులు బుధవారం బంద్ పాటించాయి.ఆన్‌లైన్ ద్వారా మందులు విక్రయిస్తున్న ఈ-ఫార్మసీ కంపెనీల కార్యకలాపాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రిటైల్ మెడికల్ షాపులు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో మూసాపేటలో కూడా మెడికల్ షాపులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి.మెడికల్ షాపులు మూతపడటంతో అత్యవసర మందులు కొనుగోలు చేయాల్సిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ప్రజలు అత్యవసర సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.కెమిస్ట్‌లు మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఫార్మసీ సంస్థల వల్ల చిన్నస్థాయి మెడికల్ షాపుల వ్యాపారం దెబ్బతింటోందని, ప్రభుత్వాలు తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వేములలో రైతులకు అవగాహన సదస్సు

### ఖరీఫ్ సాగులో ఆధునిక పద్ధతులపై శాస్త్రవేత్తల సూచనలు




**మూసాపేట,మే 20, తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**
మూసాపేట మండలంలోని వేముల గ్రామంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ శ్రీలత, డాక్టర్ మహేశ్వరమ్మ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాలు ఎంపిక, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు, సమగ్ర ఎరువుల నిర్వహణ వంటి అంశాలను వివరించారు. యూరియా వినియోగాన్ని తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు సూచనలు చేశారు.అలాగే విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూగర్భ జలాల పరిరక్షణ, తాగునీటి వినియోగంలో మితవ్యయం, సహజ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ, వరిగడ్డిని కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గిపోతుందని, లోతైన దుక్కి చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, పచ్చిరొట్ట ఎరువుల సాగు ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవి రాజాచారి, ఏఈఓ సురేష్, రైతులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వివోఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: సీఐటీయూ డిమాండ్




**మక్తల్,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఐకేపి (వీవోఏ)లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, జిల్లా కార్యదర్శి వివి నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఐకేపి (వీవోఏ) జిల్లా జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఐకేపి (వీవోఏ)లకు రూ.20 వేల వేతనం ఇస్తామని, అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పిస్తామని, అదనపు పనిభారాలను తగ్గిస్తామని పలు హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు.అంతేకాకుండా, జాబ్ చార్ట్‌లో లేని పనులను బలవంతంగా చేయిస్తూ వీవోఏలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు నిర్వహించాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతను పూర్తిగా వీవోఏలపై మోపుతున్నారని, క్షేత్ర స్థాయిలో రాజకీయ నాయకుల జోక్యం అధికమైందని ఆరోపించారు.రాజకీయ నాయకులు చేసే తప్పిదాలకు వీవోఏలను బలి పశువులుగా మారుస్తున్నారని, అందులో భాగంగానే తెలుగోని పల్లి గ్రామానికి చెందిన వీవోఏ అలివేలమ్మను సస్పెండ్ చేశారని తెలిపారు. గ్రామ సంఘాలకు రావాల్సిన ఆదాయాన్ని కూడా పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఐకేపి వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి, కార్యదర్శి తిమ్మప్ప మాట్లాడుతూ, తమ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన దశలవారీ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం పలు హామీలు ఇచ్చిందన్నారు. అదనపు పనిభారాలతో వీవోఏలను వేధిస్తున్నారని, అధికార యంత్రాంగం నుంచి కూడా వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ నాయకుల పెత్తందారీతనాన్ని అరికట్టలేని అధికారులు, వీవోఏలపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే 78 రకాల పనులు, 14 రకాల యాప్‌లతో వెట్టి చాకిరీ చేస్తున్నామని పేర్కొన్నారు.జూన్ 2లోపు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తిరుమలేష్, వివిధ మండలాల నాయకులు కృష్ణారావు, మహేంద్ర, సరస్వతి, రాదమ్మ, ఈదన్న, లావణ్య, లక్ష్మన్న, జేఏసీ నాయకులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే యనమల దివ్య



**తుని, మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** వేసవి తీవ్రత ఉన్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు.తుని మండలం వల్లూరులో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు.తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి ఎమ్మెల్యే యనమల దివ్య హాజరయ్యారు. పుష్కర ఎత్తిపోతల పథకం చైర్మన్ కుర్రా వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక కూటమి నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.అనంతరం వివిధ శాఖల అధికారుల సమక్షంలో ప్రజాదర్బార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అందిన అర్జీలను పరిశీలించి, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రధాన సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పుష్కర చైర్మన్ కుర్రా వెంకటరమణ తన సొంత నిధులతో నిర్మించిన రచ్చబండను ఎమ్మెల్యే యనమల దివ్య, కుర్రా వెంకటరమణ, కొత్తూరు బుజ్జి, దాసరి ఈశ్వరరావులతో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో తహసీల్దార్ గిడుతూరి ప్రసాదరావు, ఎంపీడీవో మరిడయ్య, కరపా అప్పారావు, మోతుకూరి వెంకటేష్, సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, పరవాడ తాతబాబు, బొప్పన రాము, చోడిశెట్టి గణేష్, చిటికెల శ్రీనివాసరావు, అరిగెల నర్సింహమూర్తి, అప్పన రమేష్, తమరాన సత్యనారాయణ, తమరాన వరలక్ష్మి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.మాజీ సర్పంచ్ కుర్రా వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తూరు బుజ్జి, దాసరి ఈశ్వరరావు, ఉప్పాడ త్రిమూర్తులు, ముంజులూరి ప్రసాద్, పెదకాపు సత్యనారాయణ, కొత్తూరు వీరభాస్కరరావు, కుర్రా బుల్లి వెంకయ్య, కొత్తూరు దొరబాబు, గెట్టం సత్యనారాయణ, చోడిశెట్టి వెంకటరమణ, కొత్తూరు ఆదినారాయణ, కుర్రా శివకృష్ణ, కుర్రా కృష్ణ, చోడిశెట్టి ధర్మయ్య, కొత్తూరు శివ, గంగిశెట్టి వాసు, కొత్తూరు గణేష్, బి. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం

### ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు న్యాయం చేయాలి: బీజేపీ డిమాండ్



**ఎల్లారెడ్డిపేట,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** ఎల్లారెడ్డిపేట మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రేపాక రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రోజులు తరబడి నిల్వ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.అలాగే "తరుగు" పేరుతో రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతులను భారీగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.వెంటనే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దాసరి గణేష్, సింగరవేణి కృష్ణ హరి యాదవ్, మల్లారపు మహేష్, రంజిత్, సంజీవరెడ్డి, యాదగిరి, కిరణ్ నాయక్, తిరుపతి, ప్రకాష్, సురేష్ నాయక్‌తో పాటు పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన వేడుకలు



**పాయకరావుపేట,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు జూనియర్ (జూనియర్ ఎన్టీఆర్) 43వ జన్మదిన వేడుకలు పాయకరావుపేట నియోజకవర్గం నందమూరి కల్చరల్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక అరటికాయల మార్కెట్ వద్ద అన్నా క్యాంటీన్ ఎదురుగా ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు చేసి జన్మదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూటమి జనసేన నాయకుడు తోట నగేష్, పాయకరావుపేట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చించలపు పద్దు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా తోట నగేష్ మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ తన తాతకు తగ్గ మనవడిగా సినీ రంగంలో విశిష్టమైన గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు. భవిష్యత్తులో రాజకీయ రంగంలోకి కూడా ఆయన అడుగుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే అన్నా క్యాంటీన్ ద్వారా ఉచితంగా అన్నప్రసాదం అందించిన నందమూరి యూత్ సభ్యులను అభినందించారు.టీడీపీ నాయకుడు చింతకాయల రాంబాబు మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలకు హాజరైన మెగా ఫ్యాన్స్, ప్రభాస్ ఫ్యాన్స్, మహేష్ బాబు ఫ్యాన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు.నందమూరి కల్చరల్ యూత్ అధ్యక్షుడు విశ్వనాధుని శ్రీను మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన వేడుకలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అనంతరం అన్నా క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమంలో తోట నగేష్ పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, నందమూరి కల్చరల్ యూత్ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కందిపూడిలో స్వచ్ఛపథం కార్యక్రమం



**పాయకరావుపేట,మే 20, తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** పాయకరావుపేట మండలం కందిపూడి గ్రామంలో స్వచ్ఛపథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లవరాజు పాల్గొన్నారు.గ్రామంలోని కాలువలు, రహదారులను సిబ్బందితో శుభ్రపరిచించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించారు. అలాగే గ్రామంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో నాని, డిప్యూటీ ఎంపీడీవో వై.వి. సత్యనారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో రాధారపు సత్యం జన్మదిన వేడుకలు




**ఎల్లారెడ్డిపేట,మే 20,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ ఎన్నారై రాధారపు సత్యం జన్మదిన వేడుకలను స్థానిక డే కేర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, అనంతరం వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతున్న రాధారపు సత్యం సేవా భావాన్ని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పుల్లయ్యగారి తిరుపతి గౌడ్, శ్రీరామోజి ప్రవీణ్, రాగుల సాయికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






# ఎన్టీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఇప్పటికే ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఫుల్ ట్రీట్ ఇచ్చారు. మరోవైపు ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబోలో రానున్న 'గాడ్ ఆఫ్ వార్'గా ప్రచారంలో ఉన్న సినిమాకు సంబంధించి నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. త్వరలోనే షూటింగ్ సెట్‌లో కలుద్దామంటూ ఆయన విషెస్ చెప్పారు. దీంతో ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులు, సెలబ్రిటీలు తారక్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు. ఒక గొప్ప వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదు. కానీ మీరు దానిని ఎంతో గౌరవంతో, వినయంతో, అసాధారణమైన ప్రతిభతో ముందుకు తీసుకెళు తున్నారు. మీ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పడానికి అదే నిదర్శనం. 'డ్రాగన్' గ్లింప్స్ అద్భుతమైన మాస్ విందులా ఉంది. మీరు ఇలాగే కోట్ల మంది హృదయాల్లో ఉంటూ బాక్సాఫీస్‌ను ఒక నిజమైన బాద్‌షాగా ఏలాలని కోరుకుంటున్నాన అంటూ శ్రీను వైట్ల పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ తారక్. హద్దులు దాటి కీర్తిని సొంతం చేసుకున్న ఓ శక్తి ఇప్పుడు మరో గొప్ప ప్రపంచంతో మీ ముందుకు వస్తోంది. డ్రాగన్ గ్లింప్స్ అదిరిపోయింది అంటూ గోపీచంద్ మలినేని శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన వ్యక్తి. నేను అభిమానించే నా హీరో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ కన్నా.. అంటూ నటి ఖుష్బూ విషెష్ చెప్పారు. హ్యాపీ బర్త్‌డే తారక్. నువ్వు ఆనందంగా ఉండాలని ఎన్నో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. డ్రాగన్ గ్లింప్స్ అద్భుతంగా ఉంది అంటూ నారా రోహిత్ ఆనందం పంచుకున్నారు. పవర్‌హౌస్, నా రావణ.. తారక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. 'డ్రాగన్' గ్లింప్స్ చాలా బాగుంది. మీ డ్యాషింగ్ లుక్ నాకు బాగా నచ్చింది. కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుందని బాబీ శుభాకాంక్షలు తెలిపారు.



# మోసపోయా!

## అనన్య నాగళ్ల భావోద్వేగం

**హైదరాబాద్, మే 20 :** తెలుగు నటి అనన్య నాగళ్ల తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు వెల్లడిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆమె సినిమాల్లోకి రాకముందు ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. నటనపై ఆసక్తితో షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ ప్రారంభించి, తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టారు. మల్లేశం చిత్రంతో వెండితెరకు పరిచయమైన అనన్య నాగళ్ల, తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, పొట్టేల్ వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య నాగళ్ల తన జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. "చాలా ఏళ్ల తర్వాత ఒక వ్యక్తి కారణంగా బాగా ఏడ్చాను. దాన్ని లవ్ ఫెయిల్యూర్ అని చెప్పను. కానీ నేను బాగా నమ్మిన వ్యక్తి నన్ను మోసం చేశాడు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. బ్రేకప్ బాధను దాదాపు మూడేళ్ల పాటు అనుభవించినట్లు ఆమె తెలిపారు. "ఉదయం లేవగానే ఆ ఆలోచనలు వెంటాడేవి. ఎంత బిజీగా ఉన్నా అవే గుర్తొచ్చేవి. రాత్రంతా ఏడ్చినా తెల్లవారగానే జిమ్‌కి వెళ్లేదాన్ని. షూటింగ్ సమయంలో కేరవాన్‌లో కూర్చొని ఏడ్చి, తర్వాత కళ్లు తుడుచుకుని కెమెరా ముందుకు వచ్చేదాన్ని" అని అనన్య చెప్పారు. అమ్మాయిల భావోద్వేగాలను సమాజం సరిగా అర్థం చేసుకోవడం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారు. "సోషల్ మీడియాలో అమ్మాయిల గురించి ఎన్నో మీమ్స్ వస్తుంటాయి. ఎక్కువగా అబ్బాయిల దృష్టికోణమే బయటకు వస్తుంది. కానీ అమ్మాయిల మనసులోని బాధ గురించి ఎవరూ మాట్లాడరు" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం అనన్య నాగళ్ల చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# హీరోతో నటించే ఛాన్స్ కోసం..

**ముంబై, మే 20:** తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన నటి హెబ్బా పటేల్ మరోసారి వార్తల్లో నిలిచారు. కన్నడ చిత్రం 'అధ్యక్ష'తో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, 'అలా ఎలా' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. అనంతరం 'కుమారి 21ఎఫ్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమా తర్వాత హెబ్బాకు వరుస అవకాశాలు వచ్చాయి. 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు', 'మిస్టర్' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గ్లామర్ పాత్రలతో పాటు విభిన్న కథాంశాలున్న సినిమాల్లో కూడా నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఓటీటీ వేదికలపైనా అడుగుపెట్టి 'మస్తీస్', 'వ్యవస్థ' వంటి వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలు పోషించారు. ఇటీవల 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన అభిమాన హీరో గురించి హెబ్బా పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అత్యంత ఇష్టమైన నటుడు జూనియర్ ఎన్టీఆర్ అని ఆమె తెలిపారు. 'కుమారి 21ఎఫ్' టీజర్ విడుదల కార్యక్రమానికి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుంచి ఆయనపై ప్రత్యేక అభిమానం పెరిగిందన్నారు. తారక్ నటన, వ్యక్తిత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఎన్టీఆర్ సినిమాలో అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమని హెబ్బా వెల్లడించారు. పాత్రకు పెద్ద ప్రాధాన్యత లేకపోయినా, కథలో చిన్న భాగమే అయినా నటించేందుకు సిద్ధమేనన్నారు. కొన్నిసార్లు కెరీర్ కంటే మనసులోని కోరిక నెరవేర్చుకోవడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. అలాగే నటుడు సునీల్ చాలా మంచివాడని, ఎంతో కేరింగ్‌గా ఉంటాడని చెప్పారు. నటుడు రాజ్ తరుణ్‌తో కలిసి ఎక్కువ సినిమాలు చేయడం వల్ల మంచి అనుబంధం ఏర్పడిందని తెలిపారు. అయితే వరుసగా కలిసి సినిమాలు చేయడంతో కొంత విరామం అవసరమని సరదాగా వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '24 కిస్సెస్' చిత్రాల్లో చేసిన పాత్రలు తనకు ఎంతో నచ్చాయని హెబ్బా చెప్పారు. ప్రస్తుతం తాను ఒంటరిగానే ఉన్నానని స్పష్టం చేశారు. ముంబైలో జన్మించిన హెబ్బా పటేల్ సామాజిక మాధ్యమాల్లో కూడా చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

# మోడల్‌గా మొదలై..

## మిస్ గ్రాండ్ నుంచి సినీ ప్రపంచం వరకు..!

## పంకూరి గిద్వానికి పెరుగుతున్న గుర్తింపు



భారతీయ నటి, మోడల్ పంకూరి గిద్వాని ప్రస్తుతం సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆమె 2016లో ఫెమినా మిస్ గ్రాండ్ ఇండియా కిరీటాన్ని అందుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 1997 అక్టోబర్ 2న జన్మించిన పంకూరి గిద్వాని, 2019లో విడుదలైన ఉజ్డా చమన్ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం పలు ప్రాజెక్టుల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఆమె లవ్ మౌళి చిత్రంతో పరిచయమయ్యారు. ఇందులో హీరోగా నవదీప్ నటించగా, పంకూరి 'చిత్ర' పాత్రలో విభిన్నమైన నటన కనబరిచి మంచి ప్రశంసలు అందు కున్నారు. ఆలోచనల్లో ప్రత్యేకత కలిగిన యువతిగా ఆమె పోషించిన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటనతో పాటు సామాజిక రంగంలోనూ పంకూరి తన ముద్ర వేస్తున్నారు. 2021లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 'ఖాదీ' ఉత్పత్తుల తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆమెను నియమించారు. సంప్రదాయ వస్త్రాల ప్రచారంలో ఆమె కీలక పాత్ర పోషించారు. సినిమాలతో పాటు ఓటీటీ వేదికలలోనూ ఆమె రాణిస్తున్నారు. లీక్! వంటి సిరీస్‌లతో పాటు 'గులాబీ రేవ్డి' వంటి ప్రాజెక్టుల్లో నటిస్తూ విభిన్నమైన పాత్రలను ఎంపిక చేసుకుంటున్నారు. యువ నటిగా పంకూరి గిద్వాని భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.